సాక్షి జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 17 । ఆగస్టు । 2023



శ్రావణం..శుభప్రదం..
నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. నెల రోజుల పాటు దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు.
- 8లో▸



వలస జీవులను మింగిన లారీ
లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆరుగురు వలస జీవులు దుర్మరణం చెందారు. వీరంతా కుటుంబ సభ్యులతో రాజస్తాన్ రాష్ట్రం నుంచి వరంగల్ జిల్లాకు వలస వచ్చారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0°/26.0°

వాతావరణం
జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కేంద్ర బృందం పర్యటన



టేకుమట్ల/రేగొండ: టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లి, రేగొండ మండలంలోని జగ్గయ్యపేట, తిరుమలగిరి, పెద్దంపల్లిలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కేంద్ర బృందం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ మరుగుదొడ్లు, కిచెన్ గార్డెన్‌ల నిర్వాహన, తడి పొడి చెత్త సేకరణ, కంపోస్ట్ ఎరువు తయారీ, మురుగు కాల్వలు, ఇంకుడు గుంతల నిర్వాహనతో పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల నిర్వాహన, హ్యాండ్ వాష్ తదితర అంశాలను పరిశీలించి ఆన్‌లైన్ చేశారు. వారి వెంట ఆయా మండలాల ఎంపీడీఓ, ఎంపీఓ, టీఏ, తదితరులు ఉన్నారు.

గద్దర్ మృతి ఉద్యమానికి తీరని లోటు



భూపాలపల్లి అర్బన్: ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి విప్లవ ఉద్యమానికి తీరని లోటని భారత్ బచావో రాష్ట్ర చైర్మన్ జహీరుద్దీన్ అలీఖాన్ అన్నారు. బుధవారం గద్దర్ సంస్మరణ సభను జిల్లా కేంద్రంలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధనకు గద్దర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. అంతకు గద్దర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం, వివిధ సంఘాల నాయకులు కామేర గట్టయ్య, సీరటి రాజన్న, సమ్మయ్య, దేవి, సత్యం, శంకర్, పార్వతి, సరస్వతి, కిరణ్, ఎంపీరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి తనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

టేకుమట్ల: ఒంటరి తనం భరించలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన టేకుమట్ల మండలంలోని వెలిశాలలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేర్ల లింగయ్య (70) కొన్ని సంవత్సరాల క్రితం అతని భార్య మృతి చెందడంతో ఒంటరితనంతో తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు.

కుష్టువ్యాధి నిర్మూలనలో భాగస్వాములు కావాలి



ఏటూరునాగారం: కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగస్వాములు కావాలని కన్నాయిగూడెం వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని దొడ్ల కొత్తూరు గ్రామంలో కుష్టు వ్యాధిపై వైద్యులు, సిబ్బంది బుధవారం సర్వే చేపట్టారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా వెంటనే వైద్యులు, సిబ్బందిని సంప్రదించాలని వైద్యులు కోరారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు సర్వేలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎల్‌సీడీసీ సర్వే ఇంటింటా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, ఆశ కార్యకర్త సునీత పాల్గొన్నారు.

సాగు సరే.. సలహాలేవి?

జిల్లాలో 12 మండలాలకు ముగ్గురే ఉద్యాన శాఖ అధికారులు

- పథకాల అమలుతోనే సరి
- చీడపీడల నివారణ చర్యలు శూన్యం
- ఇబ్బందుల్లో రైతులు



జూబ్లీనగర్‌లో డ్రాగెన్ ఫ్రూట్ తోట



నిజాంపల్లిలో బొప్పాయి తోట

భూపాలపల్లి రూరల్: జిల్లాలో ఎక్కువగా వరి, మొక్కజొన్న వంటి సంప్రదాయ పంటలతో పాటు మామిడి, అరటి బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, పసుపు వంటి ఉద్యాన వన పంటలను కూడా అత్యధికంగానే సాగు చేస్తున్నారు. అభ్యుదయ రైతులు జామ, దానిమ్మ, కూరగాయలు, తీగ జాతి బీర, కాకర వంటి లాభదాయకమైన పంటలపైన ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు ప్రాముఖ్యత ఇవ్వడంతో మూడేళ్ల నుంచి జిల్లాలో చాలా మంది రైతులు ఆయిల్ పామ్ సాగుకు మొగ్గు చూపుతున్నారు. అయితే జిల్లాలో ముగ్గురే ఉద్యాన శాఖ అధికారులు ఉన్నారు. సరిపడా ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది లేక పోవడంతో ఉద్యాన రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వలేక పోతున్నారు. ఫలితంగా రైతులు ఆశించిన దిగబడులను సాధించలేక పోతున్నారు.

34,500 ఎకరాలు అంచనా..

ఈ ఏడాది జిల్లాలో సుమారుగా 34,500 వేలకు పైగా ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగుకు అధికారులు అంచనాలు వేశారు. ఇప్పటి వరకు పండ్ల తోటల సాగు 533 ఎకరాలు, కూరగాయల సాగు 156, మూడేళ్లుగా 2,785 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుతో పాటు తదితర పంటలను సాగు చేస్తున్నారని ఉద్యాన శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఏఈఓలు పంటల సర్వేలో ఇప్పటి వరకు 7,266 ఎకరాల సాగు వివరాలు నమోదు చేశారని, మిగతా వివరాలు నమోదు చేయాల్సి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ముగ్గురే అధికారులు..

జిల్లాలో 11 పాత మండలాలతోపాటు ఇటీవల గొరికొత్తపల్లి కొత్త మండలంగా ఏర్పడింది. మొత్తం 12 మండలాలు, 241 గ్రామ పంచాయతీలు, 356 అవాస గ్రామాలు ఉండగా ముగ్గురే అధికారులు ఉండటం గమనార్హం. ఇందులో ఒక్కరు జిల్లా ఉద్యానశాఖ అధికారి కాగా, మిగతా ఇద్దరు అధికారులు డివిజన్ (క్లస్టర్)ల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాస్థాయి సమీక్ష సమావేశాల్లో పాల్గొనడంతో పాటు, ప్రజా ప్రతినిధులు, రైతులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారిని మినహాయిస్తే మిగతా ఇద్దరిలో మహదేవ్‌పూర్ డివిజన్‌లో 5 మండలాలు, మరొకరు భూపాలపల్లి డివిజన్‌లో ఏడు మండలాలను పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఉంది. గ్రామాలు ఎక్కువగా ఉండటంతో పూర్తి స్థాయిలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించలేక పోతున్నారు. అధికారుల కొరత కారణంగా కనీసం ప్రభుత్వం ప్రకటించిన పథకాలు కూడా గ్రామస్థాయిలో అందలేక పోతున్నాయి. గతంలో రెండు, మూడు మండలాలకు ఒక ఉద్యాన విస్తరణ అధికారి ఉండేవారు. వారిని ప్రభుత్వం తొలగించడంతో ఉద్యాన వనశాఖ అధికారులపై భారం పడుతోంది. సమాచారం వివరాల కోసం మండల వ్యవసాయ విస్తరణ అధికారులపై ఆధారపడుతున్నారు.

ఫొటోలతోనే సరి..

ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం పండ్లతోటలు, ఆయిల్ పామ్ సాగుకు రాయితీ వర్తింపజేస్తుంది. డ్రిప్ పరికరాలను సబ్సిడీపై అందిస్తోంది. ఈ పథకాల గురించి అన్నదాతల్లో అవగాహన కల్పించేందుకు ఉద్యానవన శాఖ అధికారులు నానా పాట్లు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో రైతు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయాల్సిన బాధ్యత ఉద్యాన శాఖ అధికారులదే. పథకం వర్తించకముందు ఒకసారి, అనుమతి మంజూరైన తర్వాత ఒకసారి, రాష్ట్ర స్థాయి అధికారులు వస్తే వారితో కలిసి మరోసారి రైతులతో ఉద్యాన వన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి ఫొటోలు దిగాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. దీంతో ఉద్యాన శాఖ అధికారులు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి ఉంది.

జిల్లాలో ఉద్యాన పంటల సాగు వివరాలు

పంటలు	విస్తీర్ణం (ఎకరాల్లో)
పండ్ల తోటలు	533
కూరగాయలు	156
మిర్చి, పసుపు	2,574
పూల తోటలు	12
ఆయిల్ పామ్	2,785
ఆగ్రో ఫారెస్టు	467
సెరికల్చర్	59
ఇతర పంటలు	680
మొత్తం	7,266

అధికారులను నియమించాలి..



అధికారులు హార్టికల్చర్ పంటలు వేస్తే లాభాలు వస్తాయని చెబుతారు. పంటలు వేసిన తర్వాత సమస్యలు వస్తే అందుబాటులో ఉండరు. అధికారులు వచ్చే సరికి పంటకు తీవ్ర నష్టం జరుగుతుంది. గ్రామాల వారీగా హార్టికల్చర్ విభాగంలో అధికారులను నియమిస్తే రైతులకు ఉపయోగం.

- నానవేని మహేందర్, టేకుమట్ల

అవగాహన కల్పిస్తున్నాం..



జిల్లాలో హార్టికల్చర్ పంటల సాగు పెరుగుతోంది. రైతులు ఉద్యాన పంటలపై మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో ముగ్గురు అధికారులు ఉన్నారు. పంటల సాగుపై రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. సమస్యలు ఉన్న రైతులు ఫోన్ చేస్తున్నారు. అధికారులు, సిబ్బంది ఖాళీల విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపించాం.

- సంజీవరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

రూ.19.78 కోట్ల నిధులు

- పీఆర్ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 19.78 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు గండ్ర వెంకటరమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేగొండ మండలం నిజాంపల్లి నుంచి గాంధీనగర్ వరకు 2.50 కిలోమీటర్ల బీటీ రోడ్డు పునరుద్ధరణకు రూ.1.56 కోట్లు, కొడవటంచ-చల్లగరిగే గ్రామాల మధ్య 2 కిలోమీటర్ల పునరుద్ధరణకు రూ.72 లక్షలు, పెద్ద కోమటిపల్లి నుంచి కోర్కిశాల వరకు 4 కిలోమీటర్ల రోడ్డు పునరుద్దరణ పనులకు రూ.2 కోట్లు, శాయంపేట మండలకేంద్రం నుంచి పెద్దకోడెపాక వరకు రూ.10 లక్షలు ప్రత్యేక మరమ్మతుకు, భూపాలపల్లి మండలం నెరేడుపల్లి నుంచి చిట్యాల మండలం నైన్‌పాక గ్రామాల మధ్య 3.80 కిలోమీటర్ల నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.20 కోట్లు, మొగుళ్లపల్లి మండలం రంగాపురం నుంచి చిట్యాల మండలం చల్లగరిగె గ్రామాల మధ్య నూతన వంతెన నిర్మాణానికి రూ.6.50 కోట్లు, ఇస్సిపేట గ్రామం నుంచి వాగోడ్డుపల్లి గ్రామానికి బీటీ పనులకు రూ.1.20 కోట్లు, గొర్లవీడు నుంచి నాచారం గ్రామాల మధ్య 4 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు, శాయంపేట మండలం హుస్సేన్‌పల్లి నుంచి మైలారం పెద్ద చెరువు వరకు 2.40 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా గణేష్



భూపాలపల్లి అర్బన్: భారత జాగృతి విద్యార్థి విభాగం (బీజేఎస్‌ఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా చీకటి గణేష్‌ను నియమించినట్లు భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాగృతి ఏర్పాటు నుంచి గణేష్ పని చేస్తూ జాగృతిని బలోపేతం చేశాడని, తన కష్టాన్ని గుర్తించి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు నియమించినట్లు హరీష్‌రెడ్డి తెలిపారు.

9 సంవత్సరాలు.. 9 అవార్డులు

రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి రికార్డు



ఉత్తమ ఎస్సైగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

టేకుమట్ల(రేగొండ): శాంతి భద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేసుకుంటూ విధులు నిర్వర్తిస్తూ 2014 నుంచి 2023 వరకు తొమ్మిది సంవత్సరాల కాలంలో 9 అవార్డులను సొంతం చేసుకోవడం అరుదు. అలాంటి అరుదైన రికార్డులను సొంతం చేసుకుంటూ విధి నిర్వహనలో ముందుకు సాగుతూ రేగొండ ఎస్సై ననిగంటి శ్రీకాంత్‌రెడ్డి ఎంతో మంది పోలీసులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవల జిల్లాలోని మోరంచ వాగు ఉధృతిలో గ్రామం పూర్తిగా వరదల్లో చిక్కుకున్న ప్రజలను పోలీస్ సిబ్బందితో పాటు, యువకులను రంగంలోకి దించి సహాయక చర్యల్లో చాకచక్యంగా వ్యవహరించి ఎంతో మందిని రక్షించారు. దీంతో డీజీపీ అంజన్‌కుమార్ ప్రశంసలు అందుకున్నారు. విపత్కర పరిస్థితుల్లో అందించిన సేవలకు గాను ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా జిల్లా కేంద్రంలో ఉత్తమ ఎస్సైగా అవార్డు అందుకున్నారు. 2021లో ములుగు జిల్లాలోని ఏటూరునాగారంలో విధులు నిర్వర్తించిన సమయంలో ప్రతీ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే 'కఠిన సేవా పథకం'ను అందుకున్నారు. ఇప్పటివరకు 2014లో పస్రా, 2015లో మంగపేట, 2017, 2018, 2019లో పరకాల, 2020, 2021లో ఏటూరు నాగారం, 2023లో (జనవరి 26), 2023 (ఆగస్టు 15) రేగొండలో ఉత్తమ ఎస్సైగా అవార్డులు అందుకున్నారు.

అందరి సహకారంతోనే..



తోటి పోలీస్ సిబ్బందితో పాటు, మండల ప్రజల సహకారంతోనే అవార్డులు సొంతం చేసుకున్న. అవార్డులతో మరింత బాధ్యత పెరిగింది. భవిష్యత్‌లో కూడా బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ముందుకు సాగుతా. అవార్డుల కోసం ఎప్పుడూ ఎదురు చూడలేదు. ప్రశంసా పత్రాలు, అవార్డులు రావడంలో సహకరించిన ప్రతిఒక్కరికి, నిరంతరం నాకు దిశా నిర్దేశాన్ని చూపిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు.

- ననిగంటి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సై, రేగొండ

ఓటు హక్కుపై విస్తృత ప్రచారం చేయాలి

- 19న 5కే రన్
- జాయింట్ ఎన్నికల ప్రధాన అధికారి సర్ఫరాజ్ అహ్మద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

భూపాలపల్లి అర్బన్: ఓటు హక్కు ప్రాముఖ్యతపై జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర జాయింట్ ఎన్నికల ప్రధాన అధికారి సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి సాధారణ ఎన్నికలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నిర్వాహణ సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు వినియోగం పెరిగే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో విద్యా సంస్థల్లో ప్రత్యేక ఎలక్టోరల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని, ఓటరు ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, ఈ నెల 19న నియోజవకర్గ కేంద్రాల్లో 5కే రన్ నిర్వహించాలని సూచించారు. నూతన ఓటరు నమోదు అంశంలో లింగ నిష్పత్తి 790 మాత్రమే ఉందని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి నూతన మహిళా ఓటర్లు నమోదు విస్తృతంగా జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటరు జాబితాలో లింగ నిష్పత్తి గమనించి తక్కువ ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నూతనంగా మంజూరు చేసిన ఓటర్లకు ఓటర్ గుర్తింపు కార్డులు ముద్రించి అందించాలన్నారు. రెండో విడత ఓటరు జాబితా ఆగస్టు 21న విడుదల చేస్తామని, సెప్టెంబర్ 19లోపు అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో తక్కువ ఓటింగ్ జరిగే ప్రాంతాలపై ప్రత్యేక ప్రణాళిక తయారు చేశామన్నారు. జిల్లాకు సంబంధించి ఆన్‌లైన్ వివరాల నమోదులో సాంకేతిక సమస్యలు ఉన్నాయని, వాటిని సంబంధిత అధికారులకు సమాచారం అందించామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రమాదేవి, స్వీప్ నోడల్ అధికారి జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, సిబ్బంది అబ్బాస్, ఇమామ్‌బాబా, నవీన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న ఏఎన్‌ఎంలు

భూపాలపల్లి అర్బన్: వైద్యఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎం పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజ్ సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు బుధవారం దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్యాఆరోగ్యశాఖలో వివిధ విభాగాల్లో 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అందిస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసి నోటిఫికేషన్ రద్దు చేసి, ఏఎన్‌ఎంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతిఒక్కరిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ దీక్షల్లో ఏఎన్‌ఎంలు సరళ, కృష్ణవేణి, సుజాత, మహేశ్వరి, చంద్రకళలు పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు చేపడుతున్న నిరవధిక సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సునీత, దీన, ఆదిలక్ష్మి, సదలక్ష్మిలు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ఐటీడీఏలో చెక్కులు అందజేసిన పీఓ అంకిత్



చెక్కులు అందజేసిన పీఓ అంకిత్

ఏటూరునాగారం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం మంగళవారి పేట గ్రామానికి చెందిన వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేసినట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఇళ్లు కూలిపోయిన బాధితులకు రూ.10ల చొప్పున చెక్కులను 16 మందికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఖానాపూర్ తహసీల్దార్ సిఫార్సు మేరకు ఐటీడీఏ నుంచి తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.10 వేలను ఇళ్ల మరమ్మతులకు అందించినట్లు వెల్లడించారు. అలాగే బాధితులకు 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు అందజేశామన్నారు. పేద గిరిజనులకు ఐటీడీఏ నుంచి ఆర్థిక సాయంతో పాటు కిరాణ సామగ్రి అందించడంపై సంతోషంగా ఉందని బాధితులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, గణాంక అధికారి ఎం.రాజ్‌కుమార్, ఖానాపురం మండల పరిషత్ అధ్యక్షుడు ప్రకాశరావు, తుడుందెబ్బ నాయకుడు గొంది నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

కూలీలైన సర్పంచ్, ఎస్‌ఎంసీ చైర్మన్



మొరం పోస్తున్న సర్పంచ్, ఎస్‌ఎంసీ చైర్మన్

టేకుమట్ల: ఇటీవల కురిసిన వర్షాలతో పాఠశాల ప్రాంగణంలో ఏర్పడిన గుంతలను పూడ్చడానికి స్థానిక సర్పంచ్, ఎస్‌ఎంసీ చైర్మన్ కూలీలుగా మారి మొరం పోసి చదును చేశారు. ఈ ఘటన టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... మండలంలోని ఆశిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో వరదల కారణంగా గుంతలు ఏర్పడి ఇబ్బందిగా మారడంతో సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలత, ఎస్‌ఎంసీ చైర్మన్ బండారి కృష్ణకుమార్‌లు స్వయంగా మొరంతో పాఠశాల ప్రాంగణాన్ని చదును చేసి పిల్లల ఆటస్థలాన్ని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు.

సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు



సమ్మె చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

ములుగు: రెండో ఏఎన్‌ఎంలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ సమీపంలో సమ్మె నిర్వహించారు. బీసీబంధు అర్హులకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మంత్రి సత్యవతి రాథోడ్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలను ప్రభుత్వం గుర్తించి రెగ్యులర్ చేయాలని కోరారు. 2016లో సీఎం కేసీఆర్ కాంట్రాక్ట్ వ్యవస్థ లేకుండా చేస్తానని హామీనిచ్చి సెకండ్ ఏఎన్‌ఎంల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయని పక్షంలో సంఘం తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు మంజుల, జమునరాణి, కౌసల్య, భాగ్య, లలిత, ఉషా, తిరుమల, నర్సమ్మ, రమా, సుజాత, తిరుపతమ్మ, సులోచన, అనురాధ తదితరులు పాల్గొన్నారు. మరో వైపు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గాంధీ చౌక్ ఎదుట ఏఎన్‌ఎంలు సమ్మె నిర్వహించారు.

జెడ్పీ సీఈఓ పనితీరు భేష్



శాలువాతో సన్మానిస్తున్న నాగజ్యోతి

ములుగు: ఇటీవల కురిసిన వర్షాలకు ముంపు ప్రాంతాల్లోని బాధితులు, గర్భిణులను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించడంలో చాకచక్యంగా వ్యవహరించిన జెడ్పీ సీఈఓ ప్రసూనారాణిని బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అభినందించారు. శాలువాతో సన్మానించారు. వరదల సమయంలో అప్రమత్తంగా ఉండడం, ప్రజలను కాపాడే విషయంలో పనితీరు భేష్‌గా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రుద్రమాదేవి, వలియాబీ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

వెంకటాపురం(కె): సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్న వీరభద్రవరం పంచాయతీ కార్యదర్శి సంజీవరావును బుధవారం నేతకాని సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంజీవరావుకు శాలువా కప్పి సన్మానించారు.

శ్రావణం.. శుభప్రదం..

రోజూ పండుగే, ప్రతీ తిథి దివ్యముహూర్తమే..

- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- ఉప్పొంగనున్న భక్తిపారవశ్యం
- వేడుకలకు దేవాలయాలు సిద్ధం

శ్రావణం.. శుభప్రదం. ఈ మాసంలో రోజూ పండుగే. ప్రతీ గడియ లక్ష్మీకటాక్షమే. ప్రతీ తిథి దివ్యముహూర్తమే. నెలంతా ఆధ్యాత్మికమే. చెట్టు.. పుట్టా.. గుడి.. రాయి.. ఇలా ప్రతీ చోటు భక్తజనులతో మొక్కులు అందుకుంటాయి. ఎక్కడ చూసినా భక్తి పారవశ్యమే కనిపిస్తుంది. ఏ కార్యం మొదలు పెట్టినా శుభకరమే. అందుకే శ్రావణమాసానికి ఇంతటి ప్రాముఖ్యం ఉంటుంది. ఈ నేపథ్యంలో నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభంకానుంది. దీనిపై 'సాక్షి' ప్రత్యేక కథనం

హన్మకొండ కల్చరల్ : ఈ సంవత్సరం రెండు శ్రావణమాసాలు రావడంలో బుధవారం అధిక శ్రావణమాసం ముగిసి నేటి నుంచి (గురువారం) నిజశ్రావణమాసం ప్రారంభమవుతోంది. ఈ నేపథ్యంలో మహిళలు తమ ఇండ్లల్లో రోజూ సుగంధపరిమాళాలతో ధూపదీపాలతో వివిధ రకాల నైవేద్యాలు సమర్పిస్తూ పూజలు జరుపుకుంటారు. కాగా, శ్రావణమాసం ఈ నెల 17వ తేదీన (గురువారం) ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 14వతేదీ (గురువారం) వరకు ఉంటుంది.

ప్రతిరోజూ ప్రత్యేకం...

శ్రావణమాసంలో సోమ, మంగళ, శుక్ర, శనివారాలను పవిత్రమైనవిగా భావిస్తారు. ఈ రోజులలో నియమనిష్టను పాటిస్తారు. శ్రావణ సోమవారం శివుడికి ప్రీతికరమైనరోజు, అలాగే శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. మంగళవారం మంగళగౌరివ్రతాలను చేస్తారు. గురువారం సాయిబాబా ఆలయాల్లో అఖండసాయినామయజ్ఞాలు జరుగుతాయి. శుక్రవారం వరలక్ష్మి వ్రతం జరుపుకున్నవారికి పుణ్యంతో పాటు లక్ష్మీప్రసన్నం కూడా జరుగుతుందని నమ్ముతారు. శనివారాలలో వేంకటేశ్వరస్వామి వారి దేవాలయాలలో ప్రత్యేకపూజలు జరుగుతాయి.

దేవాలయాల్లో ఏర్పాట్లు...

జిల్లాలోని అన్ని దేవాలయాలను అలంకరించారు. వరంగల్ ఎంజీఎం ఎదుట ఉన్న రాజరాజేశ్వరి దేవాలయం, హంటర్‌రోడ్‌లోని సంతోషిమాత ఆలయం, లష్కర్‌బజార్‌లోని సంతోషిమాత ఆలయం, హన్మకొండ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంతో పాటు నగరంలోని పలు వేంకటేశ్వరస్వామి ఆలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ శ్రావణమాసపూజలు పండితప్రవచనాలు ఏర్పాటు చేశారు.

వేయిస్తంభాల దేవాలయంలో..

రుద్రేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాసోత్సవాలలో భాగంగా గురువారం రుద్రేశ్వరశివలింగానికి సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నారు. 21న (సోమవారం) పంచమితిథిరోజు నాగపూజలు, 31న (గురువారం) రక్షాబంధనం ఉపాకర్మ పూజలు, సెప్టెంబర్ 13న (బుధవారం) మాసశివరాత్రి పూజలు, ఉదయం 11గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. శ్రావణమాసంలో శివాలయాలలో పూజలు నిర్వహిస్తే సత్ఫలితాలు అందుతాయని ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. అష్టోత్తరనామార్చానలకు రూ. 50, రుద్రాభిషేకానికి రూ. 200, నెలరోజుల అభిషేకం చేయించుకు భక్తులు ఆలయంలోని బుకింగ్ కౌంటర్‌వద్ద రూ. 1,000 చెల్లించి రశీదు పొందాలని ఆలయ ఈఓ వెంకటయ్య తెలిపారు.

శ్రావణమాస తిథుల ప్రత్యేకత..
రేపు (శుక్రవారం) శ్రావణశుద్ధ విదియరోజు వాసుదేవార్చన, లక్ష్మీపూజలు, అమ్మవార్లకు కుంకుమపూజలు వరలక్ష్మీవ్రతం ఆచరిస్తారు.



శ్రావణమాసంలో లక్ష్మీ అమ్మవారికి, గౌరీశంకరులకు పూజలు (ఫైల్)

కాళేశ్వరం..భక్తిపారవశ్యం

- నేటి నుంచి కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస వేడుకలు



శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి జోడు లింగాలు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరాలయంలో నేటి(గురువారం) నుంచి శ్రావణమాసం నెల ప్రారంభం కానుంది. ఈ నెల రోజుల పాటు కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంతో పాటు శుభానందదేవి అమ్మవారు, సరస్వతి అమ్మవార్లకు, ఆలయ ప్రాకార దేవతలకు విశేష పూజలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 14 వరకు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల 25న వరలక్ష్మీ వ్రతం సామూహింగా నిర్వహించనున్నారు. కాగా, నిజశ్రావణమాసంలో పూజలు నిర్వహించడానికి భక్తులు ఇప్పటికే ఈ నెల 30వ తేదీ వరకు అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపారు.

భక్తిభావనతో మనసు ఆహ్లాదకరం



నేను, మా వారు అమెరికాలో ఉంటాం. నా చిన్నప్పటి నుంచి మా అమ్మ వరలక్ష్మి వ్రతం రోజు అమ్మవారి రూపంతో అలంకరణ చేస్తుంది. శ్రావణమాసమంతా మా ఇంట్లో సువాసనలు వెదజల్లుతాయి. భక్తిభావనతో మనసు ఆహ్లాదకరం, ప్రశాంతగా అనిపిస్తుంది.

- వెగ్గళం నికిష, కాశిబుగ్గ, వరంగల్

భక్తి, విశ్వాసంతో పూజ చేయాలి



శ్రావణమాసం ప్రారంభమవుతుందంటే మా ఇంట్లో సందడి మొదలవుతుంది. అమ్మవారిని భక్తి, విశ్వాసంతో పూజిస్తే మనకు సకల సంపదలను పొందేలా అనుగ్రహిస్తుంది. మన పిల్లలకు పండుగల విశిష్టతను తెలియజేస్తూ పూజలలో వారిని భాగస్వాములు చేయాలి.

- గంపా శైలజాశరత్, శ్రీదుర్గా నృత్యాలయం నిర్వాహకురాలు, గోపాల్‌పూర్, హనుమకొండ

వేంకటేశ్వరస్వామి జ్యోతి వ్రతం జరుపుకుంటాం...



శ్రావణమాసంలో మా కోడలు, మా కూతురుతో కలిసి వరలక్ష్మీవ్రతం చేసుకుంటాం. అలాగే, వేంకటేశ్వరస్వామి జ్యోతి వ్రతం జరుపుకుంటాం.అనంతరం మా ఇంట్లోని పెద్దవారితో ఆశీర్వచనం తీసుకుంటాం. దీని వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది.

-వలబోజు రమాదేవి, గృహిణి, కిషన్‌పురా, హనుమకొండ

తెలంగాణ జీవన ప్రతీక.. బోనాలు

- ఉత్సవాల నిర్వహణకు సిద్ధం

బోనాల పండుగ.. తెలంగాణ జీవన విధానానికి ప్రతీక.. ఈ పండుగ సందర్భంగా శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు.. డప్పు చప్పుళ్లతో ఊరు మొత్తం దద్దరిల్లుతుంది. ఈ సమయంలో ప్రతి ఇంటి నుంచి బోనం కదలుతుంది. ఆడపడుచులు బోనం ఎత్తుకుని తన్మయత్వంతో ర్యాలీగా బయలుదేరి ఆలయానికి చేరుకుంటున్నారు. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి తనివితీరా బోనం సమర్పిస్తారు. ఈ సందర్భంగా పాడిపంటలు, సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని మనసారా వేడుకుంటారు. ఈ నేపథ్యంలో ఈ జాతరకు సమయం వచ్చింది.



బోనం ఎత్తుకున్న మహిళలు(ఫైల్)

కాజీపేట: శ్రావణమాసం ప్రారంభంతో రాష్ట్రంలో బోనాల వేడుకలు ప్రారంభమవుతాయి. ఏటా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ జాతర ఉత్సవాలు ముగిసిన వారం రోజుల్లో జిల్లాలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అయితే ఈ ఏడాది అధిక శ్రావణ మాసం రావడంతో ఉత్సవాలు నెల రోజుల పాటు ఆలస్యంగా మొదలవుతున్నాయి. ఈ క్రమంలో బుధ, ఆదివారాల్లో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పండుగను నిర్వహించుకునేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చల్లని తల్లిగా పిలువబడే పోచమ్మ ఆలయం లేని గ్రామం, పట్టణం ఉండదంటే అతిశయోక్తి కాదని చెప్పొచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 2వేలకు పైగా పోచమ్మ తల్లి ఆలయాలు ఉన్నాయి. నగరాలు, పట్టణాల్లో రెండు, మూడు కాలనీలకు ఒక పోచమ్మ ఆలయం ఉంటుంది. హిందు సంప్రాదాయాన్ని అనుసరించి శ్రావణ మాసంలో ప్రతి ఇంటి నుంచి పోచమ్మ తల్లికి బోనం సమర్పిస్తారు. కాగా, ట్రైసిటీగా పిలువబడే వరంగల్ నగరంలో కనివిని ఎరుగని తీతిలో ఉత్సవాలు నిర్వహిస్తారు. కాజీపేట, పోచమ్మకుంట, రంగశాయిపేట, మడికొండ, హనుమకొండ తదితర ప్రాంతాల్లో గొర్రె, పొట్టేళ్లతో ప్రత్యేక రథాలను తయారు చేసి అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తన్మయం పొందుతారు.

గ్రామ దేవతల అనుగ్రహం కోసం...

జిల్లాల్లో ఆదివారం లేదా బుధవారం జాతర పేర ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఏడుగురు గ్రామదేవతలైనా పోచమ్మ, మైసమ్మ, బాలమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, మహంకాళమ్మ, పెద్దమ్మ వీరికి తోడుగా గ్రామాన్ని కాపాడే పోతురాజు అనుగ్రహం కోసం ముత్తయిదువులు బోనాలు సమర్పించి పూజలు చేస్తారు. స్థానికులు ఆయా దేవాలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఊరు ఊరంతా ఈ సందడిలో భాగస్వామ్యం పంచుకుంటుంది.

మహిళ మృతదేహం లభ్యం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడ సమీపంలో జంపన్నవాగు, గోదావరి నది కలిసే సంఘం పాయ వద్ద తుప్పల్లో బుధవారం శిథిలమైన ఓ మహిళ మృతదేహం చిక్కుకొని ఉంది. ఈ మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతదేహంపై ఉన్న గుర్తులను సేకరించారు. మృతురాలు ఆరెంజ్ కలర్ చీర, బ్లూ కలర్ షెటర్ ధరించి ఉంది. ఆమె వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎరుపు రంగు చద్దరు కూడా ఉందన్నారు. ఈ ఆనవాళ్లను గుర్తుపడితే 8712670090 నంబర్‌లో తమను సంప్రదించాలన్నారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆస్పత్రిలో అగ్నిప్రమాదం..

- సుమారు రూ. 70లక్షల ఆస్తి నష్టం
- సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని వేయి స్తంభాలగుడి ఎదుట గల శ్రీనివాస కిడ్నీ సెంటర్‌లో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమాచారం అందజేయడంతో వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదాన్ని ప్రాథమిక దశలోనే అదుపు చేశారు. అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్ఓ కె జయపాల్‌రెడ్డి, ఎస్ఎఫ్ఓ ఏ నాగరాజు, ఆస్పత్రి సిబ్బంది కథన ప్రకారం ఆస్పత్రి మొదటి అంతస్తులోని ఆపరేషన్ థియేటర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకోవడంతో మిషనరీ పేలి ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. దీంతో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులు భయాందోళనలకు గురయ్యారు. ఏంజరుగుతుందో తెలుసుకునే లోపే దట్టమైన పొగలు ఆస్పత్రిని కమ్మేసాయి. అప్రమత్తమైన ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో పాటు సిబ్బంది సాయంతో 12మంది రోగులను కుడా తరలించారు. సమాచారం అందుకున్న నిమిషాల వ్యవధిలోనే చేరుకున్న ఫైర్ సిబ్బంది ప్రమాదం జరిగిన మొదటి అంతస్తులోకి అద్దాలను పగలగొట్టి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో సుమారు రూ. 70 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఘటనా స్థలిని డీఎఫ్ఓ టి వెంకన్న సందర్శించారు. ఫైర్ సిబ్బంది ఏ శ్రీనివాసరావు, బి సుధాకర్‌రెడ్డి, ఎండీ యాకూబ్, ఏ రూప్‌సింగ్, ఏ రవీందర్‌రెడ్డి, కె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-785646]

GRANITE MACHINES FOR SALE
a) SOCOMEC Italian 72 Multi Wire Variable Thickness Sparingly Used Cutting Machine, In Perfect Running Condition with All Accessories.
b) BARSANTI Italian 16 Head, Brand New Unused Fully Automatic Polishing Line, Perfect Trial Condition with All Accessories.
7397741830
BANGALORE

SERVICES

■ మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలలో గాని తాకట్టులో వున్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 100% స్పాట్ క్యాష్ ✆ 8897552200 [T-142]

WANTED

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000–16000. సంప్ర॥ 9000463426. [W-1002380]

■ స్టార్ హోంకేర్ సర్వీసు 24 గం॥ల పేషెంట్లు, పెద్దవారిని, చిన్నపిల్లలను ఇంటి వద్దనే చూసుకోవడానికి ఆడ/మగవారు కావలెను. భోజన సదుపాయం కలదు. 24 గం॥ డ్యూటీ. Cont: 8977263124, 8897730132. [W-1002379]

■ వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 21000+రూం+ భోజనం ఫ్రీ. సంప్ర॥ 6281342090, 9949857816. [WA-7213]

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221515]

■ INC ఆఫీస్ నందు పని చేయుటకు యువతీ యువకులు కావలెను. P/T - 9K / F/T - 24K. ఇతర వివరాలకు ✆ 6300264252. [G-786475]

■ లేపాక్షి హెల్త్‌కేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K, ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640400073. [HA-189320]

WANTED TEACHERS

■ Wanted Teachers to teach High School (Social & Primary Hindi. Contact: Unique High School, Warangal. Cell: 7396135390, 9948039640. [W-189135]

■ Wanted Applications from Qualified and Experienced Teachers having excellent communication skills for all subjects (Pre Primary, Primary & Upper Primary) Sal: 10,000- 12,000. IIT, Biology & Telugu (High School), Salary: 10,000-20,000/-. Contact Immediately. Cont: Shantiniketan High School, Near Durgeshwara Swamy Temple, Warangal. Cell: 7995850051. [WA-16659]

FLAT FOR SALE

■ Badangpet-Nadargul HMDA Approved 2 & 3BHK Luxury Flats, Flash Lauching Offer only 3 Days, Pay only 50% Now & Balance after 1 year with Amenities. Ph: 8008638238. [HA-515]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రాజేష్ (ఫైల్)

గంగారం : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం గంగారం మండలం కొడిశలమిట్ట గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఈసల రాజేష్ (28) తన పొలం వద్ద మోటార్ ఫ్యూజులు సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానికులు గమనించి వెంటనే 108లో గంగారం పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య ప్రియాంక, ఐదునెలల పాప ఉంది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

నిందితుల అరెస్ట్

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామంలో తమ డబ్బు చోరీ చేశారని ఆరోపిస్తూ బాలికలను హింసించిన ఘటనలో నిందితులను అరెస్ట్ చేశామని ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన పుస్కూరి మధుకర్‌రావు, ఆయన భార్య సునీత, పుస్కూరి ప్రభాకర్‌రావు ఆయన భార్య రాణి, వీరి సమీప బంధువులు వెంకటేశ్వర్‌రావు, సీతారామారావును అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోలీసుల దాడి

- కోర్టు ఆవరణలో ఘటన
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



మాట్లాడుతున్న అజయ్

జనగామ: కోర్టు ఆవరణలో ఓ యువకుడిపై పోలీసుల విచక్షణాహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై జిల్లా వ్యాప్తంగా పోలీసులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితుడు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాంనూర్‌కు చెందిన కలకొల అజయ్ కథనం ప్రకారం ఇటీవల నర్మెట మండలంలో తన భూమి కబ్జా చేస్తున్నారని భార్యాభర్తలు సెల్ఫీ వీడియోతో ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఇందులో జేసీబీ ఆపరేటర్ టేకుల రమేష్‌ను నర్మెట పోలీసులు కోర్టులో రిమాండ్ చేస్తున్న క్రమంలో అతడి బావ అజయ్ కేసు విషయమై ఆరా తీశాడు. దీంతో కేసు విషయం అడుగుతారా అంటూ నలుగురు పోలీసులు తనను విచక్షణారహితంగా కొట్టారని అజయ్ తెలిపారు. దాడి చేసే క్రమంలో వీడియో తీయగా దానిని డిలీట్ చేయించారన్నారు. ఈ ఘటనపలో కానిస్టేబుళ్లపై జనగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. ఇదిలా ఉండగా.. జనసేన పార్టీ స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె పృథ్వీ మాట్లాడుతూ కుటుంబ సభ్యుడి రిమాండ్ వివరాలు అడిగితే పోలీసు ఇలా వ్యవహరించడం హేయమన్నారు. ఈ విషయమై నర్మెట సీఐ నాగబాబును వివరణ కోరగా అజయ్‌ని పోలీసులు కొట్టలేదన్నారు. రమేష్‌ను కోర్టులో ప్రొడ్యూస్ చేసేందుకు ఉదయం 7.30 గంటలకు తీసుకు రాగా అజయ్ అక్కడకు న్యూసెన్స్ చేశారన్నారు. పోలీసులు రిమాండ్‌కు సంబంధించి పత్రాలు రాసే క్రమంలో వీడియో తీయగా దీనిని డిలీట్ చేసి వెళ్లి పోవాలని కోరామే తప్ప.. కొట్టినట్లు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

వలస జీవులను మింగిన లారీ..

- డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం
- ఆటోను ఈడ్చుకుపోవడంతో పెరిగిన ప్రమాద తీవ్రత
- ఆరుగురి దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం
- వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఘోర రోడ్డు ప్రమాదం



ఆటో నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న స్థానికులు



ఆటో ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు



నుజ్జునుజ్జు అయిన ఆటోను పరిశీలిస్తున్న సీపీ

వరంగల్: వలస జీవులను లారీ మింగేసింది. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు దుర్మరణం చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఆయా కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన సుమారు పది కుటుంబాలు తేనే సేకరణ కోసం వరంగల్ జిల్లా కేంద్రానికి వచ్చి ఓసిటీ మైదానంలో డేరాలు వేసుకుని నివాసం ఉంటున్నాయి. నెల రోజుల క్రితం వచ్చిన ఈ వలసజీవులు నిత్యం ఉదయమే ఇక్కడ నుంచి ఆటోల్లో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లి తేనె సేకరించి తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. రోజుమాదిరిగానే బుధవారం ఉదయం రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఒక ఆటోలో వర్ధన్నపేట, తొర్రూరు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో వర్ధన్నపేట మండలం ఇల్లంద వద్ద లారీ రాంగ్‌రూట్‌లో వచ్చి ఆటోను ఢీకొంది. అలాగే కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తుల్లో ఒకే కుటుంబానికి చెందిన కురేరి సురేష్ (43), అతడి కుమారులు అమిత్ కురేరి (23), నితీష్ కుమార్ కురేరి (11), సురేష్ సోదరి కుమారులు (మేనల్లుళ్లు) రూప్‌చంద్ దామి(33), జలావత్ దామి అలియాస్ జాబీర్ (19)తోపాటు ఆటోడ్రైవర్ నగరంలోని కరీమాబాద్ ఏసీరెడ్డి నగర్‌కు చెందిన బట్టు శ్రీనివాస్ (42)మృతి చెందారు. మృతుడి కురేరి సురేష్ మరో కుమారుడు అమీర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు ప్రీతి, పూజ తెలిపారు.

ఆకలి తీర్చిన వ్యాపారులు..

రెండు కుటుంబాలకు చెందిన ఐదుగురు మృతి చెందారని తెలుసుకున్న లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌కు చెందిన పలువురు వ్యాపారులు చలించారు. తమ కుటుంబ సభ్యులు మృతి చెందారని, అందుకే ఉదయం నుంచి ఏమి తినలేదని చెప్పడంతో భోజనం తయారు చేయించి వారి ఆకలి తీర్చినట్లు వ్యాపారులు బిట్ల కృష్ణ, పాపాని భాస్కర్, బూర ప్రకాశ్ తెలిపారు.

అమ్మా వస్తున్నా.. అంతలోనే దుర్మరణం

- రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ శ్రీనివాస్ మృతి
- శోకసంద్రంలో కుటుంబం



శ్రీనివాస్ (ఫైల్)

ఖిలా వరంగల్: అమ్మా వస్తున్నా...కలిసి భోజనం చేద్దాం అంటివి.. అంతలోనే మాయమైనవా.. రెండు రోజులాయే నా చేతి కూడు తినక కొడుకా...తినకుండానే వెళ్లిపోయినావా .. అంటూ ఆటోడ్రైవర్ బట్టు శ్రీనివాస్ తల్లి రాజమ్మ రోదిస్తుంటే అక్కడున్న వాళ్లంతా కంటితడి పెట్టుకున్నారు. వర్ధన్నపేట మండలం ఇల్లందలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురిలో ఆటోడ్రైవర్ బట్టు శ్రీనివాస్ కూడా ఉన్నారు. శ్రీనివాస్‌కు పదేళ్ల క్రితం వివాహం జరగగా కుమార్తె, కుమారుడు ఉన్నారు. తొమ్మిది నెలల క్రితం బతుకుదెరువు కోసం భార్య కల్పన, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. ఆర్థిక ఇబ్బందులతో రెండు నెలల క్రితం భార్య కల్పన తన పిల్లలను వెంటబెట్టుకుని నర్సంపేట ద్వారక పేటలోని పుట్టింటికి వెళ్లిపోగా.. శ్రీనివాస్ మాత్రం పుప్పాలగుట్ట ఏసీరెడ్డినగర్‌లోని తన పెద్దన్న నివాసం ఉండే తల్లి రాజమ్మ ఇంటికి చేరుకున్నాడు. అతను ప్రస్తుతం నాగమయ్య టెంపుల్ సమీప కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకుని అద్దె ఆటో నడిపిస్తున్నాడు. బుధవారం ఉదమే యజమానికి ఆటో ఇచ్చేసి ఇంటికి వస్తాననుకున్నాడు. ఈ లోపు ఓసిటీలో డేరాలు ఏర్పాటు చేసుకున్న జైపూర్‌కు చెందిన వలస జీవులు అండర్ బ్రిడ్జి వద్ద బట్టు శ్రీనివాస్ ఆటో ఎక్కి తొర్రూరులో దించాలని కోరారు. దీంతో వారిని ఎక్కించుకుని బయలుదేరగా ఇల్లంద వద్ద లారీ ఢీకొంది. దీంతో శ్రీనివాస్ మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో శ్రీనివాస్ సోదరుడు బట్టు కిషన్, వదిన మాలతీ, మృతుడి తల్లి రాజమ్మ, నర్సంపేట నుంచి చేరుకున్న భార్య కల్పన, ఇద్దరు పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో వరంగల్ పుప్పాలగుట్ట ఏసిరెడ్డినగర్‌లో విషాదం నెలకొంది.



విలపిస్తున్న శ్రీనివాస్ తల్లి రాజమ్మ, కుటుంబ సభ్యులు



శ్రీనివాస్ కూతురు, కుమారుడు, భార్య



వలస జీవుల మృతదేహాలు

అక్క ఆశీర్వాదం కోసం వచ్చి.. తిరిగిరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఐనవోలు: అక్క ఆశీర్వాదం కోసం వచ్చిన తమ్ముడు రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటన మండలంలోని కొండపర్తి గ్రామంలో జరిగింది. మామునూరుకు చెందిన ఎర్ర భాను ప్రకాష్ (26) మంగళవారం రాత్రి కొండపర్తిలో నివాసమంటున్న తన అక్కాబావ మాదాసు భార్గవి, శ్రీధర్ ఇంటికి వచ్చాడు. బుధవారం సాయంత్రం బైక్‌పై మామునూరుకు వెళ్తున్నాడు. అదే సమయంలో వరంగల్ నుంచి కొండపర్తికి ఆటో వస్తుంది. ఈ క్రమంలో కొండపర్తి గ్రామ చివర మలుపు వద్ద ఎదురెదురుగా ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో భాను ప్రకాష్‌కు తీవ్ర గాయాలుకావడంతో స్థానికులు ఎంజీఎం తరలించారు. అయితే భానుప్రకాష్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, భాను ప్రకాశ్‌కు గాయత్రితో వివాహం కాగా ఇటీవల కొడుకు జన్మించాడు. మంగళవారం కొడుకుకు 21 రోజు ఫంక్షన్‌ను చేశాడు. మరుసటి రోజు అక్క ఆశీర్వాదం తీసుకోవడం వారి సంప్రదాయం. దీంతో అతను కొండపర్తికి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి పెద్ద నాన్న కొడుకు భరత్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. భాను ప్రకాష్ మామునూరు బెటాలియన్‌లో అవుట్ సోర్సింగ్ కుక్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.



భానుప్రకాష్(ఫైల్)